క్లుప్తంగా

అగస్త్యేశ్వరస్వామి ఆదాయం రూ.1.80 లక్షలు

ధవళేశ్వరం: గ్రామంలోని అగస్త్యేశ్వరస్వామి వారి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. గడిచిన ఆరునెలలకు గాను రూ.1,80,721 వచ్చింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పందెళ్ల భానుప్రసాద్, ఎస్.చిన్నారావు, జె.శ్రీనివాసరావు, దేవులపల్లి సరితారాణి, కల్యాణి రెడ్డి, పట్టపగలు వెంకటలక్ష్మి, దేవస్థానం అధికారులు ఎం.రమణమ్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.నాగ సురేష్ పాల్గొన్నారు.

త్యాగరాజుకు ఎంపీ బోస్ పరామర్శ



త్యాగరాజును పరామర్శిస్తున్న ఎంపీ బోస్, చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ బొమ్మూరు గ్రామ అధ్యక్షుడు యెనుముల త్యాగరాజును రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఏపీజీఅండ్ బీసీ చైర్మన్, రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ బుధవారం పరామర్శించారు. త్యాగరాజు సతీమణి రమాదేవి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, మత్సేటి శివ, సద్గుణ రామారెడ్డి ఉన్నారు.

స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి



కడియపులంక సర్పంచ్ రాంజీకి వినతిపత్రం అందజేస్తున్న పోలరాజు తదితరులు

కడియం: కడియపులంకలో పద్దాల వెంకమ్మ దేవత ఆలయానికి మాజీ మున్సబ్ ఈలి చిట్టియ్య విరాళంగా ఇచ్చిన భూమి ఆక్రమణకు గురవుతోందని, దానిపై చర్యలు తీసుకోవాలంటూ బుధవారం సర్పంచ్ రాంజీకి పలువురు వినతిపత్రం అందించారు. ఆ స్థలాన్ని కుంచనపల్లి శివనాగరాజు ఆక్రమించి కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నాడని చెక్క పల్లి పోలరాజు, జంగా ఏడుకొండలు, పంతం నాగేశ్వరరావు, మంగిన త్రినాథ్ అన్నారు.

పర్యాటక దినోత్సవం

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల చరిత్ర విభాగాధిపతి ఎం.వెంకాయమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి మాట్లాడుతూ టూరిజం కోర్స్ ప్రాముఖ్యత, ఉద్యోగ అవకాశాలను విద్యార్థినులకు వివరించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతగా పాలిటిక్స్ విభాగాధిపతి లక్ష్మి వ్యవహరించారు.

సంస్కృతే హిందూధర్మానికి జీవనాడి

రాజమహేంద్రవరం రూరల్: కట్టు, బొట్టు దగ్గర నుంచి మనం పాటించే సంస్కృతి, సంప్రదాయాలను మన పూర్వీకులు ఏర్పాటు చేశారని ప్రముఖ ఆధ్యాత్మిక మహిళా ప్రవచనకర్త డాక్టర్ అనంత లక్ష్మి అన్నారు. ఈ సంస్కృతీ సంప్రదాయాలే హిందూధర్మానికి జీవనాడి అన్నారు. కొంతమూరు అఫీషియల్ కాలనీలోని వరసిద్ధి వినాయక మందిరంలో గణపతి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. వినాయక మందిర్ మహిళా కమిటీ సభ్యులు కమల కుమారి, శ్రీలక్ష్మి, రాధారాణి, భవాని, గౌరీ పాల్గొన్నారు. అక్టోబరు ఒకటిన భారీ అన్నసమారాధన, అనంతరం స్వామివారి నిమజ్జనం ఉంటుందన్నారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికుల సమస్యలు, సూచనలు తెలుసుకునేందుకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన లభించిందని డిపో మేనేజర్ షేక్ షబ్బుం తెలిపారు. పలువురు తమ సమస్యలను తెలపగా, డీఎం సానుకూలంగా స్పందించారు.

సినిమాలు

శ్యామల	:	చంద్రముఖి 2
సూర్యమినీ	:	దినస్ 2
సూర్యప్యాలెస్	:	చంద్రముఖి 2
స్వామి	:	స్కంద
శివజ్యోతి	:	మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి
అనుశ్రీ	:	స్కంద
రాజా	:	స్కంద
అశోక	:	చంద్రముఖి 2
ఊర్వశి	:	స్కంద
మేనక	:	జైలర్
అప్సర	:	స్కంద
నామవరం		
వీఎస్ మహల్	:	చంద్రముఖి 2
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	చంద్రముఖి 2
కడియం		
వెంకటసూర్య	:	స్కంద

వినాయకా.. సెలవిక..

- భక్తిశ్రద్ధలతో విగ్రహాల నిమజ్జనం
- నేడు భారీగా తరలివచ్చే అవకాశం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

సీటీఆర్ఐ: వినాయక చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా విగ్రహాల నిమజ్జనాలు జోరుగా జరుగుతున్నాయి. బుధవారం పలుచోట్ల ఏర్పాటు చేసిన విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేశారు. దాదాపు మూడు, నాలుగు రోజులుగా ఈ కార్యక్రమం జరుగుతోంది. అయితే గురువారం భారీ ఎత్తున విగ్రహాలు తరలి వచ్చే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. గోదావరి గట్టున గల హెడ్‌వాటర్ వర్క్స్ వద్ద గల ఇసుక ర్యాంప్ వద్ద వినాయక నిమజ్జనానికి నగర పాలక సంస్థ, ట్రాఫిక్ విభాగాలు పూర్తి ఏర్పాట్లు చేశాయి. నిమజ్జనం చేయడానికి వీలుగా నదిపై పంటును, అలాగే భారీ క్రేన్‌ను సిద్ధం చేశారు. గట్టు వద్ద బురదలో భక్తులు జారీ పోకుండా నల్లమట్టిని పోశారు.

నేడు పెద్దసంఖ్యలో..

గురువారం ఒక్కరోజు సుమారు వెయ్యికి పైగా చిన్న, పెద్ద విగ్రహాలు నిమజ్జనం జరిగే అవకాశం ఉంది. రాజమహేంద్రవరం నగరంతో పాటు రూరల్ మండల నుంచి కూడా విగ్రహాలను ఇక్కడకు తీసుకువస్తారు. నిమజ్జనానికి వచ్చిన భక్తులను గట్టుపైనే ఆపేస్తారు. వారి వద్ద నుంచి విగ్రహాన్ని సిబ్బంది తీసుకుని వెళ్లి గోదావరిలో నిమజ్జనం చేస్తారు. భక్తులు కూడా వచ్చి నిమజ్జనానికి పంటు ఎక్కితే బరువుకి గల్లంతయ్యే అవకాశాలున్నాయని అందుకే ఈ చర్యలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. క్రమశిక్షణతో విగ్రహాలను నిమజ్జనం చేయాలని, ట్రాఫిక్‌కు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని ఉత్సవ కమిటీలకు అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. పోలీసు, ట్రాఫిక్, నగరపాలక సంస్థ అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.



నిమజ్జనానికి గణపతి విగ్రహాన్ని తీసుకువెళుతున్న దృశ్యం

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: గణేష్ విగ్రహాల నిమజ్జనాన్ని బుధవారం ధవళేశ్వరం రామపాదాల రేవు వద్ద ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పందిర్లలోని గణపతులను ఊరేగింపుగా రేవుకు తీసుకువచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక పంటు ద్వారా గోదావరిలో నిమజ్జనం చేశారు.



గోదారమ్మ ఒడిలో గణనాథుడు



ధవళేశ్వరం రామపాదాలరేవుకు గణనాథుని తీసుకువస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

లక్కీడ్రాలో లడ్డూ

రథంవీధి ఫ్రెండ్స్ సర్కిల్ నాయకుడు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో రథం వీధిలో నిర్వహించిన గణపతి నవరాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారి వద్ద ఉంచిన 50 కేజీల లడ్డూకు లక్కీడ్రా తీశారు. ఇందులో రథం వీధికి చెందిన యడ్ల శ్రీను కుమార్తె డాక్టర్ యడ్ల మాణిక్యాంబ గెలుపొందారు. కార్యక్రమంలో లడ్డూ దాత యర్రనీటి లోవరాజు, రథంవీధి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- ఎంపీ భరత్ రామ్
- రూ.2 కోట్లతో సీసీ రోడ్ల అభివృద్ధికి శంకుస్థాపన

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్‌విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని 41, 42 డివిజన్లలో రూ.2 కోట్లతో చేపట్టిన సీసీ రహదారుల అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంటే సుపరిపాలన అన్నారు. జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ పాలనలో కులాలు, ప్రాంతాలు, రాజకీయాలు, పార్టీలనేవి ఉండవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం, గుడ్‌మార్నింగ్ కార్యక్రమాలలో తన దృష్టికి వచ్చినవి, ప్రజలు అభ్యర్థనలను పరిశీలించి నగరంలోని అన్ని వార్డులలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. అందులో భాగంగానే ఈ రోజు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. నగరంలోని 41వ డివిజన్‌లోని ఏపీ పేపర్ మిల్లు గోడకు ఆనుకుని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి కైలాస భూమి వరకూ దాదాపు 700 మీటర్ల పొడవునా సీసీ రోడ్డు నిర్మించబోతున్నట్టు తెలిపారు. అలాగే 37, 38, 42 డివిజన్లలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు చెప్పారు.



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్ రామ్

గత టీడీపీ హయాంలో నిధులన్నీ ఆ పార్టీ నాయకుల బొక్కసానికే సరిపోయాయని ఆరోపించారు. టీడీపీ నాయకులు, కార్పొరేటర్లకు రెండు శాతం కమీషన్ ఇస్తేనే పనులు జరిగేవని ఆరోపించారు. జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక్క పైసా అవినీతి ఎక్కడా జరగలేదన్నారు. టీడీపీకి నూకలు చెల్లాయని, అవినీతిలో కూరుకుపోవడం వల్లనే చంద్రబాబు పాపం పండి జైలులో ఉన్నారన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మార్గాని సురేష్, పీతా రామకృష్ణ, పోలు విజయలక్ష్మి, టీకే విశ్వేశ్వర రెడ్డి, 38, 39, 41, 42 డివిజన్ల ఇన్‌చార్జులు అరిగెల బాబు, లంకా ప్రసాద్, సుభాష్ రెడ్డి, నామన వాసు, బాలాజీ రెడ్డి, రేగుళ్ల నాని, నందివాడ సత్యనారాయణ, వెంకటనాథ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



గణపతి ఉత్సవాలలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్ తదితరులు

గణనాథునికి పూజలు

సీటీఆర్ఐ: కోటగుమ్మం సెంటర్ వద్ద చిన్న వర్తక సంఘం గణపతి నవరాత్ర ఉత్సవ పందిరిలో నిర్వహించిన మహాన్నదాన కార్యక్రమానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. అనంతరం ఆర్యాపురం సత్యనారాయణస్వామి గుడివద్ద జరిగిన పూజల్లో పాల్గొన్నారు. 21వ డివిజన్ కుమారి థియేటర్ వద్ద లక్ష్మీగణపతి ఆలయంలో మహాన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు.

రోడ్డు కం రైల్ వంతెన మరమ్మతులు ప్రారంభం

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెన మరమ్మతులకు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ బుధవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు మరమ్మతులు కొనసాగ నున్నందున రాజమహేంద్రవరం–కొవ్వూరు మధ్య రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలన్నారు. వంతెన నిర్మాణం పూర్తయి, ఇప్పటికే యాభై ఏళ్లు పూర్తి కావస్తోందన్నారు. భారీ వాహనాల రాకపోకలపై నిషేధం అమలులో ఉన్నప్పటికీ హెవీ వెహికిల్స్ తిరగడం వల్ల వంతెన దెబ్బతిందన్నారు. ఈ నెల 29న నిర్వహించే రైల్వే, ఆర్ అండ్ బీ శాఖల సంయుక్త సమావేశంలో ఈ వంతెనకు శాశ్వత మరమ్మతులపై నిర్ణయం తీసుకోగలరన్న ఆశాభావాన్ని ఎంపీ వ్యక్తం చేశారు. రోడ్డు కం రైలు వంతెన శాశ్వత మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.32 కోట్లు డిపాజిట్ చేస్తే, రైల్వే శాఖ రూ.2.97 కోట్లు భరిస్తుందన్నారు.

గడప గడపకూ సంక్షేమ వెలుగులు



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- 38వ డివిజన్‌లో పర్యటన

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో గడప గడపలో అభివృద్ధి వెలుగులు కనిపిస్తున్నాయని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 38వ డివిజన్‌లో స్థానిక హెల్త్ హాస్పిటల్ నుంచి ఉమా కోటిలింగేశ్వరస్వామిమ దేవాలయం చైర్మన్, డివిజన్ ఇన్‌చార్జి అరిగెల బాబు ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ జగన్ పాలనపై సంతోషం వ్యక్తం చేశారు. అన్ని పథకాలూ సక్రమంగా అందుతున్నాయన్నారు. డివిజన్‌లో గడపగడపకూ కార్యక్రమం ముగియడంతో లలితా నగర్ ఫారెస్టు కల్యాణ మండపంలో కార్యక్రమం నిర్వహించారు. కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించడం కోసం గడప గడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు సుంకర అంజిబాబు, రఘుపాత్రుని సాయిబాబా, వంకాయల సత్తిబాబు, కాటం రజనీకాంత్, వట్టికూటి కష్ణవేణి, కనకదుర్గ, జిత్తుక రామాంజనేయులు, తగరం సురేష్, పాలూరి శ్రీనివాసరావు, ఉప్పాడి కన్నారావు, సుధా సత్తిబాబు, కన్వీనర్లు మజ్జి వెంకటలక్ష్మి, శ్రీహరి లక్ష్మి, బాసిన రాజామణి, బత్తిన వెంకటలక్ష్మి, చెల్లె సరళ పాల్గొన్నారు.

జేసీని కలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని శ్రీచైతన్య స్కూలు విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్‌ను కలిశారు. స్కూల్‌కు త్వరితగతిన అనుమతులు ఇప్పించాలన్నారు. ఆ స్కూలుకు అనుమతులు లేవంటూ విద్యాశాఖాధికారులు సీజ్ చేశారని, దీంతో తమ పిల్లలు ఇంటి వద్దనే ఉండాల్సి వస్తోందన్నారు. స్పందించిన జేసీ మాట్లాడుతూ కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాడేపల్లి విజయకుమార్ బొమ్మూరులోని చైతన్య స్కూల్‌ని పరిశీలించారు. అనుమతి లేకుండా విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఓఎన్‌జీసీతో పలు ఒప్పందాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరులు కోరిన విధంగా సీఎస్ఆర్ సహకారం కింద అనేక ప్రాజెక్టుల అమలు కోసం కనెక్ట్ టు ఆంధ్ర, ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం వివిధ ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకుందని కనెక్ట్ టు ఆంధ్ర సీఈఓ కోట్ల శివ శంకరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఎఎన్‌జీసీ కార్యాలయంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇందులో రాజానగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో, దివాన్ చెరువులో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణంపై సంతకాలు జరిగాయి. కోట్ల శివ శంకరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సొసైటీ కనెక్ట్ టు ఆంధ్ర అన్నారు. ఇది రాష్ట్ర అభివృద్ధికి సీఎస్ఆర్ సహకారాన్ని సమీకరించడానికి రాష్ట్రంలోని ప్రధాన కార్పొరేట్లతో కలిసి పనిచేస్తుందన్నారు. డీజీఎం హెచ్ఆర్ ఎం.సోమనాథ్, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ వివేక్ మూర్తి, కనెక్ట్ టు ఆంధ్ర ప్రోగ్రాం అధికారి శ్రీరంగం శేషాద్రి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌ను బెదిరించిన ఐదుగురి అరెస్ట్

కంబాలచెరువు: ఆటో డ్రైవర్‌ను బెదిరించి సెల్‌ఫోన్, ఆటోలోని పెట్రోల్‌ను బలవంతంగా లాక్కున్న సంఘటనలో ఐదుగురిని రాజమహేంద్రవరం రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సౌత్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐ టి.గణేష్ టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఆ వివరాలను వెల్లడించారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉల్లితోట వీధికి చెందిన ఆటో డ్రైవరు పసలపూడి వెంకటేశ్వరరావు ఈనెల 25వ తేదీ రాత్రి 11.30 గంటల సమయంలో కోటిపల్లి బస్టాండ్ సమీపంలో నిలబడి ఉన్నాడు. ఆ సమయంలో ఆటోను తోసుకుంటూ వస్తున్న ఐదుగురు యువకులు వెంకటేశ్వరరావు వద్దకు వచ్చి తన ఆటోలోని పెట్రోల్ ఇవ్వాలని అడిగారు. దీనికి అతడు నిరాకరించడంతో కర్రతో దాడి చేసి, జేబులోని సెల్‌ఫోన్, ఆటోలో ఉన్న లీటరు పెట్రోలును బలవంతంగా తీసుకుని అక్కడ నుంచి పరారయ్యారు. ఈ ఘటనలపై బాధితుడు వెంకటేశ్వరరావు 2వ పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఎస్పీ పి.జగదీష్ స్పందించి, నిందితులను పట్టుకునేందుకు డీఎస్పీ కె.శ్రీనివాసులు, సీఐ టి.గణేష్ ఆధ్వర్యంలో దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. నేరం జరిగిన ప్రాంతంలో సీసీ పుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలు సేకరించారు. రాజమహేంద్రవరం ఆల్కాట్ గార్డెన్స్ బొగ్గులదిబ్బ ప్రాంతానికి చెందిన వేపూరి కిషోర్, గొర్రెల జయవర్మ, కొండ దుర్గాప్రసాద్, కట్టమూరి సూరిబాబు, గెద్దాడ సాయి చందు నిందితులుగా గుర్తించారు. వారిని పట్టుకుని, సెల్‌ఫోన్, నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సై ఎస్.మురళీకృష్ణ, కానిస్టేబుళ్లు కె.ప్రదీప్ కుమార్, ఎస్.వీరబాబు, బీఎస్‌కే.నాయక్‌ను ఎస్పీ అభినందించారు.



రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న సౌత్‌జోన్ డీఎస్పీ శ్రీనివాసులు

27న ముసాయిదా ఓటర్ల జాబితా

- డిసెంబర్ 9 వరకూ అభ్యంతరాల స్వీకరణ
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ముసాయిదా ఓటర్ల జాబితాను అక్టోబర్ 27వ తేదీన ప్రకటిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సాయంత్రం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హౌసింగ్ సొసైటీలలో పీఎస్‌ల ఏర్పాటు కోసం సర్వే పూర్తి చేయడం, స్థలాల గుర్తింపును సెప్టెంబర్ 29 నాటికి పూర్తి చేయాల్సి ఉండగా అటువంటి సొసైటీలు లేవని, స్లమ్ ఏరియాలో ఉన్న ఇళ్లలోని ఓటర్లపై ఇప్పటికే సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు అభ్యంతరాలు, సూచనలను అక్టోబర్ 2లోగా పూర్తి చేయాల్సి ఉండగా, ఆ లక్ష్యం సాధించామన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాలు, సూచనల కోసం రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో జిల్లా స్థాయి సమావేశాన్ని అక్టోబర్ 3వ తేదీ నిర్వహిస్తామన్నారు. తదుపరి క్లైయిమ్ లు, అభ్యంతరాలను డిసెంబర్ 9 వరకూ స్వీకరిస్తామన్నారు.



మాట్లాడుతున్న జేసీ తేజ్ భరత్

451 మందికి వైద్య పరీక్షలు

కాతేరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష పైలట్ వైద్య శిబిరంలో 451 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని జేసీ తేజ్ భరత్ అన్నారు. బుధవారం సాయంత్రం సీఎం కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాల కొండయ్య జిల్లా కలెక్టర్లతో జేఏఎస్‌పై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జేసీ ఎస్.తేజ్ భరత్, డీఆర్వో జి.నరసింహులు, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.సనత్ కుమారి, డీఎల్‌డీవోలు వి.శాంతమణి, పి.వీణాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ వివరాలను తెలియజేస్తూ, 177 శిబిరాలకు చెందిన డేటా ఎంట్రీ పనులను ప్రారంభించామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఏఎన్ఎంలు 1,08,879 ఇళ్లకు గాను 61,079 ఇళ్లను, పట్టణ ప్రాంతంలో 1,17,632 ఇళ్లకు గానూ 63,512 ఇళ్లను సందర్శించారన్నారు.

తెలుగు పాఠ్యపుస్తక రచయితగా గూటం స్వామి



డాక్టర్ గూటం స్వామి

రాజమహేంద్రవరం రూరల్: ప్రముఖ కవి, రచయిత డాక్టర్ గూటం స్వామి పదో తరగతి నూతన పాఠ్యపుస్తకం రచయితగా నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ఆయన ఉత్తర్వులు అందుకున్నట్టు బుధవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఒక్కొక్క తరగతి కొత్త పాఠ్య పుస్తకాలు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. వచ్చే విద్యాసంవత్సరం పదోతరగతి అన్ని పాఠ్య పుస్తకాలు మారనున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగు పాఠ్యపుస్తకం రచయితగా డాక్టర్ స్వామి నియమితులయ్యారు. ఇప్పటికే ముప్పైకి పైగా పుస్తకాలు రాసిన స్వామికి గతంలో మహారాష్ట్ర మాధ్యమిక విద్యాబోర్డులో తొమ్మిదో తరగతి, 12వ తరగతి తెలుగు పాఠ్య పుస్తకాలు రచించిన అనుభవం ఉంది. ఆయన బొమ్మూరులోని జీపీఆర్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా స్వామిని పాఠశాల హెచ్ఎం ఎ.ఈశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ధవళేశ్వరం: గ్రామంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు బుధవారం రాజమహేంద్రవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. రాజమహేంద్రవరం అగర్వాల్ ఆసుపత్రి డాక్టర్లు నేత్ర, పవన్ ఆపిల్ డెంటల్ ఆసుపత్రి డాక్టర్ అడబాల ప్రసాద్ ఆధ్వర్యంలో దంతాలకు వైద్య పరీక్షలు జరిపారు. అంకాలజిస్ట్ డాక్టర్ పట్నాల విశ్వనాథ్ చైల్డ్ హుడ్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం యు.సత్యనారాయణ, రాజమహేంద్రవరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఏపీఎస్ సత్యనారాయణ బాబు, సహ కార్యదర్శి వి.కుమార స్వామి, కోశాధికారి ఎంవీ రాఘవులు, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ జీఎల్ వసంత కుమారి పాల్గొన్నారు.


30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



మాట్లాడుతున్న డాక్టర్ జెస్సీప్రియ

కడియం: మండలంలో ఈనెల 30 నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను విజయవంతం చేయాలని వైద్యాధికారులు జేసీ సుప్రియ, మణిజ్యోత్స్న, నాగసాయిమౌర్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఈనెల 30న దుళ్ల విలేజ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్1లో ప్రారంభమై నెలరోజుల పాటు వీహెచ్‌సీలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సర్వే నిర్వహిస్తున్నారన్నారు. సర్వే ద్వారా రోగులను గుర్తించి వారి పరిధిలో జరిగే ఆరోగ్య శిబిరాలకు తీసుకువచ్చి అవసరమగు పరీక్షలు చేసి మందులు ఇస్తారన్నారు. ఈసీజీ పరీక్షలు కూడా నిర్వహిస్తారన్నారు. సమావేశంలో కడియం సీహెచ్‌సీ, కడియపులంక పీహెచ్‌సీలకు చెందిన ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలకు విద్యార్థుల విరాళం



విరాళం అందజేస్తున్న గొల్లపల్లి సత్యనారాయణ, టి.సత్యనారాయణ

కడియం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయం చేయడంలో ముందుంటామని నిరూపించుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సత్యనారాయణ అధ్యక్షతన శుభోదయం అంధుల పాఠశాల రావులపాలెం వారి స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోవడానికి గాను చిన్నారులు సేకరించిన విరాళాలు అందజేశారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు రూ.37 వేలు సేకరించి అందజేశారు. ఈ సందర్భంగా అధిక మొత్తంలో విరాళాలు సేకరించిన విద్యార్థులకు జి.సత్యనారాయణ ఉత్తమ సేవా జ్ఞాపికలను, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శుభోదయం అంధుల పాఠశాల కార్యనిర్వాహకుడు కె.ఈశ్వరరావు, ఆదిలక్ష్మి, శ్రీనివాస్, కృప, మధు పాల్గొని చక్కటి దేశభక్తి గేయాలను ఆలపించారు.

గుర్రం జాషువా జయంతి

సీటీఆర్ఐ: సాంఘిక వివక్ష, ఆర్థిక అసమానత, రాజకీయ అవినీతిపై యుద్ధం చేసిన విశ్వనరుడు గుర్రం జాషువా అని ఆర్ట్స్ కళాశాల తెలుగు శాఖాధిపతి పీఏ సత్యనారాయణ అన్నారు. కళా గౌతమి, ఎస్కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ సంయుక్త నిర్వహణలో బుధవారం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబెల్ రాజబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.